క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 11కేవీ వెంకటరమణ కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు, అదేవిధంగా 11కేవీ మమతానగర్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: మామిడిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా రాజీవ్‌గాంధీనగర్, హార్డ్‌వేర్ పార్కు, అబ్బుషేర్ కాలనీ, ముదిరాజ్ కాలనీ, ఉమర్ కాలనీల్లో మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వీ.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జీఎంఆర్ టౌన్‌షిప్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, జల్‌పల్లి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం కలగడాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రైతులతో ఎమ్మెల్యే మాటామంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరులో సోమవారం ఎమ్మెల్యే సబితారెడ్డి ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో కొత్తూర్ గేట్ వద్ద ఫార్మాసిటీ రహదారిపై ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, ఎం.జయేందర్, టి.ఇందిరదేవేందర్, కె.దశరథ, ఎ.మేఘనాథ్‌రెడ్డి, పి.ఆనంద్, జి.సామయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటలను కలిసిన చైర్‌పర్సన్



చైర్‌పర్సన్ హేమలతను సన్మానిస్తున్న ఎంపీ ఈటల

తుక్కుగూడ: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను సోమవారం తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత దంపతులు, కౌన్సిలర్లతో కలిసి మర్యాదపూర్వకంగా మున్సిపాలిటీ కేంద్రంలో కలిశారు. ఎంపీగా గెలిపొంది మొదటిసారిగా తుక్కుగూడకు వచ్చిన సందర్భంగా ఎంపీకి పలువురు సన్మానించారు. ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీజేపీ నుంచి ఎన్నికైన హేమలతను ఎంపీ సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజమోని రాజు, బాకి విలాస్, జపాల భావన, తదితరులు ఉన్నారు.

బాల్యం అమూల్యమైనది



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

ఇబ్రహీంపట్నం రూరల్: 'బాల్యం అమూల్యమైనది. విద్యార్థి దశ నుంచే దేశభక్తి, దేశ సమగ్రత పట్ల అంకితభావంతో మెలగాలి. నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి' అని ప్రధానోపాధ్యాయుడు వర్కాల పరమేష్ అన్నారు. సోమవారం ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయులుగా తోటి వారికి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుందని తెలిపారు. బాల బాలికలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.

పాఠశాలల తనిఖీ

ఆమనగల్లు: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఎంఈఓ పాండు తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల యాజమాన్యాలు చిన్నారులను అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. పాఠశాల ఆవరణ, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రిషి టాలెంట్ స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు అందజేశారు.

పడకేసిన 'ప్రత్యేక' పాలన

- పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య వ్యవస్థ
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయం

మహేశ్వరం: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. పంచాయతీ పాలక వర్గాల పాలన ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. ప్రభుత్వం జిల్లా, డివిజన్, మండల, గ్రామ పంచాయతీ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించింది. వీరు ఆయా గ్రామ పంచాయతీలు, మండలాలు, డివిజన్ల అధికారులను సమన్వయం చేసుకుంటూ నిత్యం గ్రామాల్లో సందర్శించి, ప్రజాసమస్యలను పరిష్కరించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. కానీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వలన ప్రత్యేకాధికారులు పల్లెలకు చుట్టచూపుగా వస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి నిదర్శనం గ్రామాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం, ప్రజా సమస్యలు పెరగడమే..

గ్రామసభల నిర్వహణపై నిర్లక్ష్యం

పంచాయతీరాజ్ చట్టంలో సెక్షన్ 46 ప్రకారం ప్రతీ రెండు నెలలకు ఒకసారి గ్రామ పంచాయతీలో గ్రామ సభలను నిర్వహించి, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పనులపై నిర్ణయం తీసుకోవడం, గతంలో చేసిన పనులపై చర్చించాలి. కానీ ప్రస్తుతం సాగుతున్న ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామసభలు అటకెక్కాయని ప్రజలు ఆరోపిస్తుండగా.. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్ము అంతంత మాత్రంగానే ఉంటుందని, తాగునీరు, పారిశుద్ధ్యం పనులతో పాటు ఇతర అత్యవసర పనులకు సొంతంగా చేతి నుంచి ఖర్చు చేస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు. కేవలం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల నాలుగు నెలలకొకసారి జనాభా దమాషా ప్రకారం విడుదలవుతున్నాయని, కానీ అవి ట్రాక్టర్ కిస్తీలు(ఈఎంఐ), డీజిల్, కార్మికుల వేతనాలకే సరిపోవడం లేదని కార్యదర్శులు తెలిపారు. దీంతో పంచాయతీల నిర్వహణ తమకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక సొంత డబ్బులను వెచ్చిస్తున్నామని వెల్లడించారు.

ప్రజలకు తప్పని తిప్పలు

మండల పరిధి 30 గ్రామ పంచాయతీలకు 12మంది ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ.. ప్రత్యేక అధికారులు తమ సొంత కార్యాలయాల్లోని పనులకే పరిమితమవుతున్నారు. ప్రస్తుత సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో బిజీగా ఉంటూ.. గ్రామాలకు అసలు రావడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులపై అజమాయిషీ లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో పాటు సమయపాలన పాటించడం లేదు. గ్రామాల్లో సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్‌కు సైతం సక్రమంగా వేతనాలు అందించకపోవడంతో వారు పారిశుద్ధ్య పనులు చేసేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. గత సర్పంచ్‌ల కాలంలో పారిశుద్ధ కార్మికుల వేతనాలు విడుదల ఆలస్యమైనప్పుడు సర్పంచ్‌లు సొంత నిధులు వెచ్చించి పనులు చేయించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏది ఏమైనా జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి ఉన్నతాధికారులు దృష్టి గ్రామ పాలనను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ పరిష్కరిస్తున్నాం. మండలంలో 12 మంది ప్రత్యేక అధికారులను నియమించాం. వారి శాఖ విధులతో పాటు గ్రామాన్ని సందర్శించి జీపీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని సూచిస్తున్నాం. ప్రతి సమావేశాల్లో సలహాలు, సూచనలు ఇస్తున్నాం. గైర్హాజరవుతున్న వారిని గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీలక్ష్మి, (జిల్లా పరిశ్రమల శాఖ అధికారి) మండల ప్రత్యేకాధికారి, మహేశ్వరం

మోడల్ స్కూల్‌లో ప్రహరీ క్లబ్ ఏర్పాటు



విద్యార్థులకు సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్, కళాశాలలో ఎస్ఐ సైదులు ఆధ్వర్యంలో సోమవారం ప్రహరీ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రహరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వెంకటరమణ, క్లబ్ సభ్యులుగా 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థి సభ్యులుగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రహరీ క్లబ్ లక్ష్యం, విధి విధానాలను గురించి వివరించారు. ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలు, పొగాకు వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసై భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను ఉపయోగిస్తే గుర్తించి వెంటనే ఉపాధ్యాయులు లేక పోలీసులకు గానీ సమాచారం అందించాలని సూచించారు. సైబర్ క్రైం గురించి, స్మార్ట్ ఫోన్ ద్వారా, యాప్‌ల ద్వారా ఎలా నేరాలకు పాల్పడుతున్నారు. మనం ఎలా జాగ్రత్తగా ఉండాలనే విషయాలను కానిస్టేబుల్ మురళీకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలు భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి

భారత అథ్లెటిక్ క్రీడాకారిణి నందిని

బడంగ్‌పేట్: చదువులతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్‌కు పునాదులు పడతాయని ప్రముఖ భారత అథ్లెటిక్ క్రీడాకారిణి, ఆసియా కాంస్యపతక విజేత నందిని అగసర అన్నారు. సోమవారం కీసరలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో అంతర తేజస్ క్రీడా ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందిని ప్రముఖ భారత అథ్లెటిక్ క్రీడాకారుని అగసర హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో 50 మీటర్ల రన్నింగ్ రేస్, రిలే రేసులు, మిక్స్‌డ్ రిలేలతో సహా పలు అథ్లెటిక్స్ ఈవెంట్లను, వీటితో పాటు పోమ్‌పామ్ డ్రిల్, జుంబా డ్రిల్ తదితర వాటిని నిర్వహించారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం బెస్ట్ అథ్లెటిక్స్ అవార్డులను విద్యార్థులకు ప్రకటించారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ.. క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు సాగితే ఎంచుకున్న ప్రతి క్రీడల్లోనూ రాణిస్తారని అన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకారమైన మాటలతో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం నందినిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ మల్క కొమురయ్య, డైరెక్టర్ సుశీల్‌కుమార్, సీఈఓ మల్క యశ్వి, ప్రిన్సిపాల్ శ్రీలత, అకాడమీ డైరెక్టర్ డా.టీ.సుధ, ఉపాధ్యాయులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడాలని సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈ నెల 26న జిల్లా కేంద్రంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి నిరసన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ఆర్థిక విధానాల వలన దేశ ప్రజలు, కార్మికులు, కర్షకులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నష్టపోతున్నారని పేర్కొన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర, వ్యవసాయ ఖర్చులకు 50 శాతం అదనంగా జోడించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, పింఛన్ రూ.10 వేలు అందరికీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు రమేశ్, నాయకులు యాదయ్య, జంగయ్య, వెంకటయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

డిపో మేనేజర్‌కు వినతి

మంచాల: ఇబ్రహీంపట్నం నుంచి చౌటుప్పల్ వెళ్లే ఆర్టీసీ బస్సును మంచాల మండలం తిప్పాయిగూడ మీదుగా నడిపించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్పకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంతకు ముందుగానే బస్సును తిప్పాలని పేర్కొన్నారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించారని, పరిశీలన అనంతరం సర్వీసును వేస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

నేడు ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరం

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సురసాని విఠల్‌రెడ్డి, సెక్రటరీ తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే శిబిరంలో మధుమేహ నిర్ధారణ పరీక్షతో పాటు వైద్య సలహాలు అందించనున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వేకు 27 వరకు అవకాశం

కందుకూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ఈ నెల 27 వరకు అవకాశం ఉందని ఎంపీడీఓ జి.గీత సోమవారం తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా సర్వే నిర్వహిస్తున్న సమయంలో అందుబాటులో లేకపోతే వారి వివరాలను సేకరించడానికి మరో రెండు రోజులు అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు. వివరాలు నమోదు చేయించుకోని వారు మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ హెచ్.మహాలక్ష్మిని సెల్ నంబర్ 8247886207లో సంప్రదించాలని కోరారు.

మండల కేంద్రంగా ప్రకటించాలి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ వైస్ చైర్మన్ ఏదుల శరత్‌చంద్ర డిమాండ్ చేశారు. మండలానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్ష సోమవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పోరాడుతున్నామని, ప్రజల ఆకాంక్ష మేరకు మండల కేంద్రంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గోవింద్, సాయమ్మ, జమున బాయ్, బాలయ్య, చెన్నయ్య, ఈదమయ్య పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ కాంప్లెక్స్ మంజూరుపై హర్షం

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ పాలిటెక్నిక్ కళాశాలను కల్వకుర్తి నియోజకవర్గానికి మంజూరు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ యువ నాయకుడు యాదగిరి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధి ఖానాపూర్ గ్రామ శివారు ప్రభుత్వ భూముల్లో కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారని పేర్కొన్నారు. మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటన

ఆమనగల్లు: అభివృద్ధి పనుల ప్రారంభం నేపథ్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ నెల 26న మండల పరిధిలో పర్యటించనున్నారని ఎంపీడీఓ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కోనాపూర్ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మించనున్న పశువుల షెడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. అనంతరం ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభిస్తారని వెల్లడించారు.

క్రీడలతో మానసికోల్లాసం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: క్రీడలు శారీరక దృఢత్వాన్ని, మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొల్లపడకల్ గ్రామంలో క్రీడాకారులకు వాలీబాల్, షటిల్ కిట్లు పంపిణీ చేసి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ క్రీడల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన సూచించారు. కొల్లపడకల్ గ్రామంలో యువకులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం అభినందనీయమన్నారు. అంతకుముందు క్రీడాకారులకు వాలీబాల్, షటిల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందిగామ యాదయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు సంగెం భాస్కర్‌గౌడ్, నాయకులు జాల కృష్ణ, చేపంగి జంగయ్య, కట్టెల రాజశేఖర్, రాజు, ప్రశాంత్, మల్లేశ్, శ్రీకాంత్, మున్న, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

మహేశ్వరం: మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో గుట్టపైన కొలువైన పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు సోమవారం ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి వేద పండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు, అమ్మవార్లకు అభిషేకం, హారతి, కుంకుమార్చన, వేంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదా సమేత అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. స్వామివార్లకు పుష్పార్చన, మూలదేవత హోమములు, ప్రసాద వితరణ, సాయంత్రం లక్ష్మి హోమం, సుదర్శన హోమం, విష్ణు సహస్రనామాలు, పారాయణం, శ్రీలక్ష్మిదేవి కుంకుమార్చన, ప్రసాద వితరణ పలు పూజలు నిర్వహించారు. ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులందరూ హోమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల రమేశ్, ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి కడల భాస్కర్, ఉపాధ్యక్షులు నీరటి జగదీశ్‌ముదిరాజ్, కమ్మరి బుచ్చిబాబుచారి, సంయుక్త కార్యదర్శి హైతాబాద్ రాజు, ఆలయ అర్చకుడు ప్రేమ్‌కుమార్‌శర్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

మీర్‌పేట: జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ 'నారాయణ ప్రీమియర్ లీగ్'లో మీర్‌పేట నారాయణ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఖోఖో జూనియర్స్, క్రికెట్, జూనియర్ ఖోఖో బాలికలు, సీనియర్ ఖోఖో బాలికలు, జూనియర్ కబడ్డీ బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి మొదటిస్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ బాబ్జీ తెలిపారు. అదేవిధంగా జూనియర్, సీనియర్ కబడ్డీ బాలుర, జూనియర్ రన్నింగ్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీందర్‌బాబు పాల్గొన్నారు.

చెట్లనరికివేత సరే.. తొలగించేదెవరు?

- రోడ్లపై పేరుకుపోయిన చెట్లకొమ్మలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



రావిర్యాల ఔటర్ రింగు రోడ్డు ఫుట్‌పాత్‌పై చెట్లకొమ్మలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ వ్యాప్తంగా విద్యుత్ అధికారులు ఫీడర్ల వద్ద చెట్ల కొమ్మలను నరికివేశారు. ఈ చెట్ల కొమ్మలు నరికివేసి రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం వాటిని తొలగించడం లేదు. దీంతో నరికివేసిన కొమ్మలు, శ్రీశైలం జాతీయ రహదారిపై, కలెక్టర్ కార్యాలయ రోడ్డు, ఔటర్‌రింగు రోడ్డు ఫుట్‌పాత్‌పై అలానే ఉన్నాయి. ఇవి వాహనదారులు, పాదచారులకు అడ్డు కావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి నరికివేసిన చెట్టు కొమ్మలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

కనీస వేతనాలు అందించాలి

వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వాలు కనీస వేతనాలను అందజేయాలని మున్సిపల్ స్టాఫ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీసం నెలసరి వేతనం రూ.26 వేలను అందజేయాలన్నారు. రెండు పూట పని విధానాన్ని రద్దు చేసి, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధులు నిర్వహించేలా అధికారులు చూడాలన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 60ని ఈ ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దత్తునాయక్, మున్సిపల్ సిబ్బంది నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాయాత్ర



ప్రజాపాలన విజయోత్సవాలపై కళాకారుల ప్రదర్శన

కడ్తాల్: ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలపై కళాయాత్ర కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న సందర్భంగా నవంబర్ 19 నుంచి డిసెంబర్ 7వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల యాత్ర సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, మహాలక్ష్మి, రుణమాఫీ, ఇందిర మహిళాశక్తితో పాటు అభివృద్ధి కార్యక్రమాల గురించి తమ ఆటపాటల ద్వారా కళాకారులు వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ యాదయ్య, మోహన్‌రాజు, అపూర్వ, యాదమ్మ, నాయకులు రాజేశ్, భానుకిరణ్, రాఘవేందర్, బ్రహ్మచారి, నర్సింహ, శివలింగం, శ్రీకాంత్, వెంకటయ్య, శ్రీలత తదితరులు ఉన్నారు.